WWW.EPAPER.MAHAADAILY.COM
Follow: @ANNTELUGU
ANN తెలుగు
# మహా పత్రిక
# వరంగల్
హన్మకొండ-భూపాలపల్లి-ములుగు-మహబూబాబాద్-జనగాం
01-11-2024 | శుక్రవారం, హైదరాబాద్





## ట్రాఫిక్ గాలికి.. వసూళ్లకు పరుగులు..

- నగరంలో ఎక్కడికక్కడే నిలుస్తున్న ట్రాఫిక్
- సమస్య పరిష్కారంపై ట్రాఫిక్ పోలీసుల దృష్టేది?

02



ఇంటి ముందు ముగ్గువేస్తున్న వారిపైకి

## దూసుకెళ్లిన కారు.. ఇద్దరికి తీవ్ర గాయాలు..

**మహా, మధ్యప్రదేశ్ :**

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఇండోర్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. ఇంటి ముందు ముగ్గు వేస్తున్న ఓ బాలిక, మహిళపైకి దూసుకెళ్లింది. సోమవారం ఉదయం రద్దీగా ఉన్న ఓ వీధిలో ఇంటి ముందు 14 ఏళ్ల బాలిక, 21 ఏళ్ల మహిళ ముగ్గు వేస్తున్నారు. ఆ సమయంలో అతి వేగంగా వచ్చిన కారు.. అదుపుతప్పి వీరిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటన అనంతరం డ్రైవర్ కారును అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో బాలిక, మహిళకు తీవ్ర గాయాలైనట్లు తెలిసింది.



# చివరి ఆయకట్టుకు నీళ్లేవి ?

**డీబీఎం 31 కాల్వ నిండా పిచ్చిమొక్కలు, తుమ్మ చెట్లు.. నీరందక ఎండుతున్న పంటలు**

**మహా, వరంగల్ :**

శ్రీరాంసాగర్ జలాలపై ఆధారపడి సాగు చేసిన పొలాలు ఎండిపోతున్నాయి. ఆయకట్టుకు నీళ్లు చేరకపోవడంతో చివరి తడి కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. శాయంపేట పరిధిలోని ఎస్సారెస్పీ డీబీఎం 31 ప్రధాన కాల్వ, ఉప కాల్వ మైలారం శివారు వరకు ఉంది. జూన్‌లో కాల్వ నీళ్ల ఆధారంగా రైతులు వరి పంటను సాగుచేశారు. శ్రీరాంసాగర్ జలాలు 1ఆర్ ఉప కాల్వ చివరకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. శాయంపేట శివారులో వరి పంటకు నీళ్లు అందక ఎండిపోతున్నట్లు రైతులు చెప్పారు. 15 రోజులకు ఒకసారి అరకొరగా కాల్వల్లో నీళ్లు రావడంతో తడి పెట్టుకున్నారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉండగా నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు. కాల్వల్లో కొద్దిపాటిగా వస్తున్న నీళ్లు బుంగ పడి వృథాగా పోయాయి.రైతులే సొంత ఖర్చులతో మరమ్మతులు చేసుకున్నట్లు చెప్పారు. మొరం తెప్పించి జేసీబీతో బుంగను పూడ్చేసినట్లు దీంతో వచ్చే అరకొర నీటితో పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నామని వాపోయారు. కాల్వల నిండా తుమ్మ చెట్లు, పిచ్చిమొక్కలు, గడ్డి పెరగడంతో నీళ్లు చివరి వరకు రావడం కష్టంగా మారింది. కొన్నేండ్లుగా ఎస్సారెస్పీ అధికారులు కాల్వల పరిస్థితిని కన్నెత్తి చూసిన దాఖలాలు లేవంటున్నారు. మరికొంతమంది రైతులు వ్యవసాయబావుల నుంచి రూ. 2,500 చెల్లించి నీటిని కొనుక్కొని పారించుకుంటున్నట్లు చెప్పారు.




ప్రైవేట్ ట్రావెల్ బస్సు

## ఢీకొని వ్యక్తి మృతి..

జీడిమెట్లలో ఘటన

**మహా, హైదరాబాద్ :** ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన జీడిమెట్ల పరిధి షాపూర్‌నగర్ చౌరస్తాలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రహదారి దాటుతున్న వ్యక్తిని వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు పాదచారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.



# పండుగపూట విషాదం..

**హై టెన్షన్ వైర్ తగిలి బాలుడికి తీవ్ర గాయాలు**

**మహా, హైదరాబాద్ :**

వెలుగులు నింపాల్సిన దీపావళి పండుగ వారి కుటుంబంలో చీకట్లను మిగిల్చింది. దీపాల పండుగను ఎంతో ఘనంగా జరుపుకోవాలని ఆశపడ్డ వారికి తీవ్ర నిరాశే మిగిలింది. వివరాల్లోకి వెళ్తే.. దీపావళి పండగ సందర్భంగా లైటింగ్ ఏర్పాటు చేస్తుండగా, ఇంటి పైనుంచి వెళ్తున్న హై టెన్షన్ వైర్ తగిలి బాలుడి శరీరం పూర్తిగా కాలిపోయింది. ఈ విషాదకర సంఘటన అంబర్‌పేటలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దీపావళి పండగ సందర్భంగా లైటింగ్ ఏర్పాటు చేస్తుండగా, ఇంటి పైనుంచి వెళ్తున్న హై టెన్షన్ వైర్ తగిలి అభి(14) అనే బాలుడి శరీరం పూర్తిగా కాలిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, అభి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కుల గణన కోసం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం: మంత్రి పొన్నం



**మహా, హైదరాబాద్ :**

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో భాగంగా రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు..దేశంలో మొదటిసారి సమగ్ర కుల గణన ప్రక్రియ ఈనెల 6 వ తేదిన ప్రారంభమవుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. సమగ్ర సర్వే సక్రమంగా జరిగి భవిష్యత్‌లో అందరికి సమ న్యాయం జరిగేలా అందరు సహకరించాలన్నారు. దీనికి సంబంధించి త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కూడా గ్రామీణ ప్రాంతాలలో అధికారులకు సహకరించాలని సూచించారు. 150 ఇళ్లకు అధికారుల బృందం సమగ్ర సమాచార సేకరణ చేపడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అన్ని రకాలుగా అందుబాటులో ఉండాలన్నారు.